
పిల్లర్ దశలో ఆగిన పనులు

గోరంట్ల గాడిన పడేనా?

- దశాబ్దాల కల హంద్రీనదిపై వంతెన
- పిల్లర్లకే పరిమితమైన పనులు
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు


వర్షాలకు తెగిన తాత్కాలిక మట్టిరోడ్డు


రోడ్డు లేకపోతే ఇలా వెళ్లాల్సిందే (ఫైల్)

కోడుమూరు రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో హంద్రీ నదిపై గోరంట్ల వంతెన నిర్మాణం దశాబ్దాల కల. పిల్లర్లకే పరిమితమైన ఈ నిర్మాణం ముందుకు సాగేనా అన్నది ప్రశ్నార్థకరంగా మారింది. ఇక్కడ వంతెన నిర్మాణం జరిగితే మూడు నియోజకవర్గాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. కోడుమూరు, పత్తికొండ, డోన్ నియోజకవర్గాల నుంచి పలుగ్రామాల ప్రజలు ఇటుగా ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా హంద్రీ అవతలి వైపు గ్రామాలు ఎర్రగుడి, కొత్తపల్లి, మన్నెకుంట, ఎర్రబాడు, తొగర్చేడు, మల్లాపురం, పోతుగల్లు, రామక్రిష్ణాపురం తదితర చోట్ల నుంచి కోడుమూరు, కర్నూలు వంటి చోట్లకు వివిధ పనులు, వైద్యసేవల కోసం వెళ్తున్నారు. అలాగే గోరంట్ల గ్రామ రైతులకు హంద్రీ అవతలి వైపున పంట పొలాలు ఉన్నాయి. దీంతో ఇక్కడి హంద్రీనది దాటితే సమయం, దూరం కలిసివస్తుంది. వర్షాకాలంలో ఎగువ నుంచి వరద వస్తే ఇరువైపులా నుంచి రాకపోకలు స్తంభిస్తున్నాయి. వరద తగ్గే వరకు చుట్టూ సుమారు 20 కిమీ


హంద్రీనదిలో బైక్‌ను తోసుకుంటూ వెళ్తున్న వాహనదారులు

అదనంగా ప్రయాణించాల్సి ఉంటుంది. గోరంట్ల రైతులు పంటలను పర్యవేక్షించుకోలేక దిగుబడులను కోల్పోతున్నారు. పంచాయతీరాజ్ శాఖ (పీఐయూ) నిధులు రూ.21 కోట్లతో హంద్రీనదిపై వంతెన, కొత్తపల్లి వరకు రహదారి మంజూరు చేశారు. దీంతో ఏళ్లనాటి కల నెరవేరుతుందని ప్రజలు విశ్వసించారు. పనులు సాగుతున్న క్రమంలో పిల్లర్ల దశలో పనులు నిలిచిపోయాయి. యంత్రాలను ఒడ్డుకు చేర్చి కాంట్రాక్టర్ వెళ్లిపోయాడు. బిల్లుల పెండింగ్ కారణంగా పనులు నిలిచిపోవడంతో ప్రజలు నిరాశకు గురయ్యారు. వంతెన నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో హంద్రీనదిలో తాత్కాలికంగా మట్టిరోడ్డు నిర్మించారు. దీంతో ఆ రోడ్డుపై ఆటోలు, బైక్‌లు, ట్రాక్టర్, లారీ వంటి వాహనాలు, ఎద్దులబండ్లు రాకపోకలు సాగించేవి. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో ఎగువ నుంచి వరద రావడంతో మట్టిరోడ్డు కోతకు గురైంది. వాహనాలు వెళ్లేందుకు కష్టతరంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం హయాంలోనైనా పనులు సాగుతాయని స్థానికులు ఆశ పెట్టుకున్నారు.

పారదర్శక పంపిణీ

- రేషన్ దుకాణాల వద్దే బియ్యం
- ఐదేళ్ల తర్వాత పూర్వ వైభవం
- తొలి రోజు 1.10 లక్షల కార్డులకు బియ్యం సరఫరా
- ప్రజాభీష్టం మేరకే పంపిణీ : మంత్రి భరత్


కర్నూలు నగరం కప్పలనగర్‌లో రేషన్ దుకాణం వద్ద బియ్యం కోసం వచ్చిన కార్డుదారులు

కర్నూలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బియ్యం పంపిణీలో అక్రమాలను అరికట్టాలనే లక్ష్యంగా ఐదేళ్ల తరువాత కూటమి ప్రభుత్వం చౌక దుకాణాల వద్దే రేషన్ పారదర్శక పంపిణీకి ఆదివారం శ్రీకారం చుట్టింది. జిల్లాలో వంద శాతం రేషన్ షాపులు ఓపన్ చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిస్తే.. తొలి రోజే 1.10 లక్షల కార్డుదారులకు బియ్యం అందించి నాలుగో స్థానంలో నిలిచారు. ఎండీయూ వాహనాలు ఎప్పుడొస్తాయో తెలిసేది కాదని, గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. రేషన్ డిపోలు తెరవడంతో పగలు పనులు ముగించుకొని సాయంత్రం వేళ బియ్యం తెచ్చుకుంటామని పేర్కొంటున్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు 7 వేల కార్డుదారులకు ఇళ్ల వద్దకే వెళ్లి బియ్యం పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం మళ్లీ పాత విధానంలో బియ్యం పంపిణీ చేపట్టడంతో కార్డుదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 25 మండలాల పరిధిలో పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణలో 1,233 రేషన్ పంపిణీ దుకాణాలు ఉన్నాయి. వాటి పరిధిలో 6,71,200 బియ్యం కార్డులు ఉన్నాయి. ప్రతి నెల 11,800 మెట్రిక్ టన్నులు బియ్యం కార్డుదారులకు సరఫరా చేయాలి. 1983లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాక పేదలకు రాయితీ బియ్యం పథకం అమలుకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి 2021 ఫిబ్రవరి వరకు అంటే 39 ఏళ్లుగా రేషన్ దుకాణాల వద్దనే కార్డుదారులకు బియ్యం పంపిణీ చేసేవారు. 2021 ఫిబ్రవరిలో నాటి వైసీపీ ప్రభుత్వం ఇంటింటికి బియ్యం సరఫరా చేయాలని మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ)కు శ్రీకారం చుట్టింది. ఎండీయూ వాహనాలు పేద బియ్యం అక్రమ రవాణాకు అడ్డాగా మారాయనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. అక్రమార్కులతో కొందరు ఎండీయూ వాహనదారులు కుమ్మక్కై రేషన్‌కార్డుదారులకు బియ్యం ఇవ్వకుండా.. కిలోకు రూ.10 చొప్పున లెక్కకట్టి ఇచ్చేవారు. ఆ బియ్యాన్ని నల్లబ జారుకు తరలించి సొమ్ము చేసుకునేవారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. వాస్తవంగా ప్రభుత్వం ఒక కిలోకు రూ.46కు పైగా ఖర్చు చేస్తోంది. ఎండీయూ వాహనాలే బియ్యం అక్రమ రవాణాకు అడ్డాగా మారిందనే ఆరోపణలు రావడంతో టీడీపీ కూటమి ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి పాత పద్ధతిలో రేషన్ దుకాణాల వద్దే పంపిణీకి శ్రీకారం చుట్టింది. కర్నూలు నగరంలో మంత్రి టీజీ భరత్, నియోజకవర్గాల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు రేషన్ దుకాణాల్లో పేదలకు బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రత్యేక పరిశీలకులు జి.మోహన్‌బాబు, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్‌లు గూడూరు మండలం కె.నాగులాపురం, పెంచికలపాడు గ్రామాల్లో బియ్యం పంపిణీ తీరుపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు.


రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్న మంత్రి టీజీ భరత్


మాధవి నగర్‌లో రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్న డీలర్


అరోరానగర్‌లో..

జిల్లాలో ఆదివారం తొలి రోజు బియ్యం పంపిణీ వివరాలు

వివరాలు	కర్నూలు
రేషన్ దుకాణాలు	1,233
రేషన్ కార్డుదారులు	6,71,200
బియ్యం కోటా నెలకు	11,800 టన్నులు
తొలి రోజు	1.10 లక్షల కార్డులకు పంపిణీ
65 ఏళ్ల వృద్ధులు	7 వేల కార్డుదారులకు పంపిణీ

కార్డుదారుల అభీష్టం మేరకే

పేదలకు బియ్యం పంపిణీలో ఎండీయూ వాహనాలు ద్వారా ఎన్నో ఇబ్బందులు ఉండేవి. ఇంటింటికి వెళ్లి ఇవ్వకుండా వీధి చివర్లో వాహనం ఆపుకొని బియ్యం ఇచ్చేవారు. ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. అలాగే అక్రమాలకు అడ్డాగా మార్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ విధానంపై 11 నెలలు పరిశీలించాం. కార్డుదారులు అభిప్రాయం, అభీష్టం మేరకు పేదలకు బియ్యం పంపిణీ చేయడంతో పాటు అక్రమాలను అరికట్టాలనే లక్ష్యంగా పాత విధానం అమల్లో తీసుకొచ్చాం. 65 ఏళ్లు పైబడిన, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా డీలర్లు ఇళ్ల వద్దకే వెళ్లి బియ్యం పంపిణీ చేస్తారు.

- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి

అక్రమాలకు పాల్పడితే లైసెన్స్ రద్దు

రేషన్ దుకాణాల డీలర్లు నిబంధనల మేరకు ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచి బియ్యం ఇవ్వాలి. కార్డుదారులతో సత్ప్రవర్తన కలిగి ఉండాలి. ఎక్కువ ధరలు వసూలు చేసినా, చిల్లర ఇవ్వకపోయినా, బియ్యంకు బదులుగా డబ్బులు ఇచ్చినట్లు ఫిర్యాదులు వస్తే లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకుంటాం.

- రాజా రఘువీర్, జిల్లా పౌర సరఫరాల విభాగం జిల్లా అధికారి, కర్నూలు

గుంతకల్లు-కడప మధ్య స్పెషల్ ప్యాసింజర్ రైలు

మద్దికెర, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సోమవారం నుంచి గుంతకల్లు-కడప మధ్య ప్రత్యేక ప్యాసింజర్ రైలును నడుపుతున్నట్లు రైల్వే డివిజన్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైలు (నం:07521) కడపలో ఉదయం 7:45 గంటలకు బయలుదేరుతుంది. ఎర్రగుంట్లకు 8:13 గంటలకు, కొండాపురంలో 8:40 గంటలకు, తాడిపత్రికి 9:13 గంటలకు, గుత్తి 10:03 గంటలకు వచ్చి గుంతకల్లుకు ఉదయం 11:15 గంటలకు చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో రైలు (నం.07522) గుంతకల్లులో మధ్యాహ్నం 1:30 గంటలకు బయలుదేరి గుత్తికి 1:55కు, తాడిపత్రికి 2:40, కొండాపురానికి 3 గంటలకు, ఎర్రగుంట్లకు 3:43కు, కడపకు సాయంత్రం 5:15 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ ప్రత్యేక రైలులో మొత్తం 22 బోగీలు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు.

నేటి నుంచి జూనియర్ కాలేజీలు ప్రారంభం

- కళాశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి జూనియర్ కళాశాలలు ప్రారంభం కానున్నాయి. కర్నూలు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు మొత్తం 162 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ కళాశాలలు 26, ప్రైవేటు కళాశాలలు 136 ఉన్నాయి. ఈ కళాశాలలో 46వేల మంది ప్రథమ, రెండో సంవత్సరం విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థి మిత్ర కిట్స్ ద్వారా అందించే ఉచిత పాఠ్య పుస్తకాలు కళాశాలలకు చేరాయి. మొదటి రోజు కిట్లను అందించేందుకు ఇంటర్ బోర్డు అధికారులు చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్న భోజనం పథకం కింద విద్యార్థులకు ఆహారం అందించేందుకు చర్యలు చేపట్టారు. కళాశాలలో బోధనా, బోధనేతర సిబ్బంది కొరత కూడా ఉంది. ఈ సమస్యను అధిగమించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

కానిస్టేబుళ్ల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

- 16 పరీక్షా కేంద్రాలు
- 6,947మంది అభ్యర్థుల హాజరు


పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంటు బోర్డు ఆదివారం పోలీస్ కానిస్టేబుల్ (సివిల్, ఏపీఎస్పీ) అభ్యర్థులకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షను కర్నూలులో 16 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, బృందావన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాల, కేవీ సుబ్బారెడ్డి కళాశాల, అధీనా పాఠశాల, మాంటిస్సోరి ఇండస్ రెసిడెన్షియల్ పాఠశాల, శంకరాస్ డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలులో 16 పరీక్షా కేంద్రాల్లో 7,597 మంది అభ్యర్థులకు గానూ 6,947 మంది అభ్యర్థులు మెయిన్స్ పరీక్షకు హాజరయ్యారన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు భద్రతను ఏర్పాటు చేశామన్నారు. అడిషినల్ ఎస్పీ హుశేన్‌పీరా, డీఎస్పీలు శ్రీనివాసాచారి, ఉపేంద్రబాబు, హేమలత, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

డీసీఎంఎస్ బలోపేతానికి కృషి

చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వై.నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని ఆ సంస్థ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ ప్రకటించారు. ఆదివారం కర్నూలు నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు. ముందుగా డీసీఎంఎస్ మేనేజర్ రాజేష్. చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ ఒకప్పుడు డీసీఎంఎస్ అన్ని విభాగాల కంటే ఆర్థికంగా బలోపేతంగా ఉండేదని, అన్ని రకాల సేవలు ప్రజలకు రైతులకు అందేవని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ సంస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయిందన్నారు. అనంతరం డీసీఎంఎస్ అధికారులు, ఉద్యోగులతో సంస్థ ప్రగతికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు తదితర కేంద్రాల పరిధిలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని, వాటికి విముక్తి కల్పించి డీసీఎంఎస్ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు హనుమంతరావు చౌదరి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగేంద్ర కుమార్, డీసీఎంఎస్ కేంద్రాల అధికారులు రాజేష్, రాజు, షేక్షావలి, షర్మిల, రాజీవ్, రవికృష్ణ, నవీన్, కిరణ్ రెడ్డి, ప్రవీణ్, మహేశ్వరరెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న వై.నాగేశ్వరరావు యాదవ్

యోగా దినోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు

- 8,15,000 మంది పేర్లు నమోదు
- 3న ఓర్వకల్లు రాతివనం వద్ద
- 12న కొండారెడ్డి బురుజు, 18న రాఘవేంద్రస్వామి మఠంలో కార్యక్రమాలు : కలెక్టర్ రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జూన్ 21వ తేదీన జిల్లా స్థాయిలో పెద్దఎత్తున అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లుచేసినట్లు కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం వరకు జిల్లాలో 8,15,000 మంది ప్రజలు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయిలో మే 26నుంచి 30వరకు నిర్వహించిన యోగా పోటీల్లో 28809 మంది పాల్గొనగా 19,200 మంది విజేతలుగా నిలిచారన్నారు. గ్రామ, వార్డు స్థాయి విజేతలతో మండల, మున్సిపాలిటీ స్థాయిలో జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు, మండల, మున్సిపాలిటీ స్థాయి విజేతలతో జిల్లాస్థాయిలో జూన్ 9నుంచి జూన్ 14వ తేదీ వరకు జిల్లా స్థాయి విజేతలతో రాష్ట్రస్థాయి పోటీలు జూన్ 17నుంచి 18వ తేదీ వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలైన ఓర్వకల్లు రాతి వనం వద్ద జూన్ 3న, కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద జూన్ 12వ తేదీన, మంత్రాలయం రామవేంద్రస్వామి మఠంలో ఈ నెల 18వ తేదీన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. జూన్ 18వ తేదీ నగరంలో పారిశుధ్య కార్మికులను భాగస్వామ్యం చేస్తూ సామాజిక యోగా కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఏసీబీ వలలో పోలీస్



- రూ.లక్ష డిమాండ్
- రూ.80వేలకు బేరం
- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ హెడ్ కానిస్టేబుల్
- ప్రధాన నిందితుడు ఫోర్త్ టౌన్ సీఐ మధుసూదన్‌గౌడు

7



ప్రతిభకు పట్టాభిషేకం

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న పద్మశాలీయ సంఘం నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల పద్మశాలీయ సంఘం పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన పద్మశాలీయ కులస్తుల విద్యార్థుల ప్రతిభ పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం నంద్యాలలోని భద్రావతి భావన ఋషి దేవాలయ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మెరిట్ ప్రాతిపదికన ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులుగా రూ.10వేలు, రూ.7.5వే లు, రూ.5వేలు, రూ.2వేలు నగదుతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని 110 మంది విద్యార్థులకు అందజేశారు. భీమనపల్లె వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమానికి విశిష్టఅతిథిగా రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఉడత వెంకట బసవరావు, రాయల సీమ ప్రాంతీయ పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పద్మశాలీయ సంఘం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కూటమి'పై పోరాటానికి వైసీపీ సిద్ధం

- రెడ్‌బుక్ పేరుతో వైసీపీ నేతలపై కేసులు
- కుడా మాజీ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజలను మోసగించిన కూటమి ప్రభుత్వంపై వైసీపీ పోరాటానికి సిద్ధమైందని కుడా మాజీ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రశ్నిస్తే రెడ్‌బుక్ పేరుతో వైసీపీ నేతలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు అనేక పథకాల అంటూ ప్రజలను మోసగించి టీడీపీ కూటమి ఓట్లు వేయించుకొని గద్దెను ఎక్కిందని ఆరోపించారు. ఇందులో భాగంగా ఈ నెల 4న వెన్నుపోటు దినం అనే పేరుతో గూడూరు పట్టణంలో కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆదిమూలపు సతీష్, జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, రమేష్ నాయుడు, రవికుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లింగమూర్తి, లాయర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు కేంద్రంగా కంచి యూనివర్సిటీ

- కంచి యూనివర్సిటీ డీన్ ఆచార్య కె. వెంకటరమణ



మాట్లాడుతున్న కంచి యూనివర్సిటీ డీన్ ఆచార్య కె. వెంకటరమణ

కర్నూలు కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):కంచి యూనివర్సిటీ (చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహావిద్యాలయం) ఉన్నత విద్యకు కేంద్రమని ఆ యూనివర్సిటీ డీన్, అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య కె. వెంకటరమణ తెలిపారు. ఆదివారం పాతనగరంలోని శంకర మందిరంలో స్పాట్ అడ్మిషన్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్, బీఏఎంఎస్, బీఎడ్, బీఎస్సీ, ఎల్ఎల్‌బీ, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఈ, ఆయుర్వేదంతో పాటు పలు విభాగాల్లో ప్రవేశ ఎంపికలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. ఇంజనీరింగ్‌లో ఎంసెట్‌తో సంబంధం లేకుండా మెరిట్ ఆధారితంగా ప్రవేశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఉత్తమ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఉంటాయని అన్నారు. ఈనెల 30 వరకు అడ్మిషన్లు ఉంటాయని, విద్యార్థులు తమ అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో 'కంచి యూనివ్ డాట్ ఏసీ డాట్ ఇన్' వెబ్ సైట్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్‌కే మనోహర్‌రావు, కార్య నిర్వాహక కార్యదర్శి కళ్లే చంద్రశేఖర్ శర్మ, సభ్యులు హెచ్‌కే రాజశేఖర్, హరిహరనాథశర్మ, నరసింహారావు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో పోలీస్

- రూ.లక్ష డిమాండ్
- రూ.80వేలకు కుదిరిన బేరం
- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ హెడ్ కానిస్టేబుల్
- తప్పుడు కేసును కోర్టుకు రెఫర్ చేసేందుకు లంచం
- డీఎస్పీ శ్రీనివాసాచారి సమక్షంలో విచారణ
- సీఐ మధుసూదన్‌గౌడు ప్రధాన నిందితుడు
- ఏసీబీ డీఎస్పీ సోమన్న వెల్లడి



సీఐ మధుసూదన్‌గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్

కర్నూలు క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నాలుగో పట్టణ సీఐ మధుసూదన్ గౌడు, హెడ్ కానిస్టేబుల్ రవి రూ.80వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేయగా సీఐ మధుసూదన్‌గౌడు తాను నేరుగా కాకుండా హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ ద్వారా బాధితుల నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. కొత్తబస్టాండు ఎదురుగా ఉన్న నిర్మల హోటల్‌లో హెడ్‌కానిస్టేబుల్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న తెలిపిన వివరాలు.. బాధితులు బెస్త రఘు, బెస్త రవి నుంచి హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ రూ.80వేలు లంచంను నేరుగా తీసుకున్నాడు. తాను సీఐ మధుసూదన్‌గౌడు సూచనల మేరకే తీసుకున్నానని చెప్పడంతో ఏసీబీ అధికారులు సీఐని కూడా అదుపులోకి తీసుకున్నారు.

మైదా పిండితో మొదలైన వైరం

స్థానిక బీ.క్యాంపు చెందిన బెస్త రఘు, బెస్త రవి గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో ఓ బేకరి నిర్వహిస్తున్నారు. వీరికి చలపతి అనే వ్యాపారి మైదాపిండి సరఫరా చేస్తుంటాడు. 2023లో మైదాపిండి సరియైన క్వాలిటీ లేకపోవడంతో వీరి మధ్య వైరం నెలకొంది. ఆ ఏడాదే చలపతి, మరో ఇద్దరు మిత్రులు నాగేంద్రబాబు, శ్రీనివాసులుతో కలిసి బెస్త రఘుపై దాడిచేశారు. బెస్త రఘు వీరి ముగ్గురుపైన నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులకు బెయిల్ ఇచ్చి పంపించేశారు. ఆ కేసు కోర్టులో ఉండగానే మైదాపిండి వ్యాపారి చలపతి న్యాయవాది కృష్ణారెడ్డి ద్వారా బెస్త రఘుపై కేసు నమోదుచేయాలని కోర్టును ఆశ్రయించాడు. కోర్టు సూచనల మేరకు 2024 జూన్ 3న బెస్త రఘుపై అప్పటి సీఐ శంకరయ్య కేసు నమోద చేశారు. తనపై దాడిచేశాడని చలపతి ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసును విచారించిన సీఐ అందులో వాస్తవాలు లేవని గుర్తించి కేసును పెండింగ్‌లో ఉంచారు.

ఎంత బతిమాలినా...

ఈ కేసులో తమ తప్పేమీ లేదని, తాము చిరు వ్యాపారులమని, తమ పాపకు కూడా అనారోగ్యంగా ఉందని బాధితులు బతిమాలారు. అయినా కూడా సీఐ వినలేదు. కేసును తప్పుడు కేసు అని కోర్టుకు రెఫర్ చేయాలంటే.. మీపై కేసు లేకుండా చేయాలంటే రూ.లక్ష డిమాండ్ చేశాడని బాధితులు ఆరోపించారు. ఇందుకు హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ మధ్యవర్తిత్వం వహించాడు. రూ.90వేలకు బాధితులకు, సీఐకి మధ్య బేరం కుదుర్చారు. బాధితులు వారం రోజుల క్రితమే రూ.10వేలు హెడ్ కానిస్టేబుల్ రవికుమార్‌కు ఇచ్చాడు. మిగతా రూ.80వేలు ఇచ్చేందుకు వారం రోజులు గడువు కోరారు. ఈ 80వేలు ఇచ్చుకోలేని స్థితిలో ఉన్న బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఆదివారం సీఐకి ఫోన్‌చేశారు. హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్‌కు ఇవ్వాలని సూచించడంతో కొత్తబస్టాండు వద్ద నిర్మల హోటల్‌లో హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ రాగానే ఆయనకు రూ.80వేలు అప్పగించారు. అతడు ఆడబ్బులు తీసుకుని హోటల్‌లో ఉన్న క్యాష్ కౌంటర్‌లో పెట్టాడు. అప్పటికే మాటు వేసిన ఏసీబీ అధికారులు రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. తాను సీఐ సూచనల మేరకు తీసుకున్నానని ఏసీబీ అధికారుల ముందు వాపోయాడు.



హెడ్ కానిస్టేబుల్ రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు

పదేళ్లకు పైగా జైలు.. అని బెదిరింపులు

ఇటీవలే బాధ్యతలు చేపట్టిన సీఐ మధుసూదన్‌గౌడు పెండింగ్ కేసు వివరాలు బయటకు తీశాడు. ఇందులో బెస్త రఘుకు చెందిన కేసు పెండింగ్‌లో ఉందని గుర్తించాడు. ఈ కేసులో నిందితులైన బెస్త రఘు, బెస్త రవిలను నెల క్రితం స్టేసన్‌కు పిలిపించాడు. మీపై కేసు ఉందని వివరణ ఇవ్వాలని ఆదేశించాడు. వీరు కేసు వివరాలకు సీఐకు వివరించారు. అయినా ఆయన సంతృప్తి చెందలేదు. ఈ ఎఫ్ఐఆర్ ప్రకారం మిమ్మల్ని కోర్టులో హాజరు పరిస్తే రిమాండ్ పడుతుందని, పదేళ్లకు పైగా జైలుశిక్ష పడుతుందని బెదిరించాడు. ఇలా నెలరోజుల పాటు స్టేషన్ చుట్టూ తిప్పించుకున్నాడు.

ఏసీబీ అధికారుల అదుపులో సీఐ

సీఐ ప్రధాన నిందితుడు అని తెలుసుకున్న ఏసీబీ అధికారులు ప్రత్యేక టీం ఏల్లూకారు బంగ్లా ఉన్న సీఐ ఇంటి వద్ద కాపలా కాశారు. నిర్మల హోటల్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ రెడ్ హ్యాండెడ్‌గా దొరకగానే అక్కడ సీఐని అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ఆయనను స్టేషన్‌కు తీసుకువచ్చి కూర్చోబెట్టారు. రాత్రి పొద్దుపోయేదాకా స్టేషన్‌లోకి ఎవరినీ రానీయకుండా సీఐని విచారించారు. కర్నూలు ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసాచారిని స్టేషన్‌కు పిలిపించి ఆయన సమక్షంలో కేసు వివరాలపై విచారణ చేపట్టారు.

ఏసీబీ ఆధీనంలో సీఐ కుటుంబ సభ్యులు

యెల్లూకారు బంగ్లాలో ఉన్న సీఐ కుటుంబ సభ్యులు ఏసీబీ అధికారులు వారి ఆధీనంలోకి తీసుకున్నారు. వారి సెల్‌ఫోన్లు తీసుకుని ఎవరినీ కూడా బయటి వారిని సంప్రదించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. సోమవారం ఆ ఇంట్లో సోదా నిర్వహించే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు తెలిపారు.



పట్టుబడ్డ నగదుతో హెడ్ కానిస్టేబుల్



బాధిత సోదరులు బెస్త రఘు, బెస్త రవి

కలకలం..

నగరంలో ప్రధాన పోలీస్ స్టేషన్ సీఐ ఏసీబీకి చిక్కడం పోలీసుశాఖలో కలకలం రేపింది. ఓ కేసును మాఫీ చేసేందుకు లంచం తీసుకుంటూ సీఐ పట్టుబడటంతో జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం.

కాళ్లావేళ్లా పడినా కనికరం చూపలేదు

కేసు పరిష్కారం పేరుతో సీఐ నెల రోజులుగా తమను చాలా ఇబ్బంది పెట్టాడు. ఓవక్క వ్యాపారంలో అప్పులై తీవ్రంగా నష్టాల్లో ఉన్న కూడా లంచం డిమాండ్ చేశా డు. తమ తమ్ముని కూతురు ఆరోగ్యం బాగా లేదని కాళ్లావేలా పడినా కూడా కనికరం చూపలేదు.

\- బెస్త, రఘు, బాధితుడు

రూ.100 తక్కువైందని..

పుష్ప సినిమాలో మాదిరిగా ఒక్కటి తక్కువైందనే డైలాగ్‌ను గుర్తుపెట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ దానిని అక్షరాలా పాటించాడు. బాధితులు మొదట రూ.10వేలు ఇచ్చిన సమయంలో ఇంటికి వెళ్లి లెక్కపెట్టుకుని రూ.100 తక్కువైందని మరీ ఫోన్ చేశాడని బాధితులు ఆరోపించారు. 'తిరిగి ఆ నోటు ఇచ్చే సమయంలో కూడా రూ.100 తక్కువైనా కూడా మా సీఐ ఊరుకోడబ్బా..' అంటూ చెప్పాడని బాధితులు ఆరోపించారు.

పురుగుమందు తాగి వ్యక్తి బలవన్మరణం

బనగానపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పురుగుమందు తాగి ఓ వ్యక్తి బలవ న్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనంలో మండలంలోని పలుకూరు గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన అబ్దుల్‌గని అనే వ్యక్తి తాగుడుకు బానిసై పనులకు వెళ్లకుండా అనారో గ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు మందలించగా జీవితంపై విరక్తి చెంది ఆదివారం పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు షేక్ అలీ మౌళాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎక్సైజ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

కర్నూలు క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేపీ వెంకటరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న ఎక్సైజ్ ఉద్యోగి ఇంట్లో చోరీ చోటు చేసుకుంది. బాలచంద్రుడు కర్నూలు ఎక్సైజ్ కార్యాలయంలో సూప రింటెండెంట్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 28వ తేది తన కుటుంబ సభ్యులతో కలిసి షిర్డీకి వెళ్లాడు. తిరిగి ఆదివారం ఇంటికి వచ్చి చూస్తే ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో బీరువాలో ఉన్న 15 తులాల బంగారు నగలు, అర కిలో వెండి చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కంటైనర్

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

వెల్దుర్తి టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జాతీయ రహదారి-44లో చెరుకులపాడు క్రాస్ వద్ద ఆదివారం సాయంత్రం బైక్‌ను కంటైనర్ ఢీ కొట్టడంతో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. కృష్ణగిరి మండలం ఎరుకులచెరువు గ్రామానికి చెందిన సురేష్, కురువ బాలు అలియాస్ ప్రహ్లాద బైక్‌పై స్వగ్రామం ఎరుకులచెరువుకు వెళ్తున్నారు. కాగా చెరుకులపాడు క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా కర్నూలుకు వెళ్తున్న కంటైనర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్(35) అక్కడికక్కడే మృతి చెందగా, కురువ బాలు అలియాస్ ప్రహ్లాదకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. మృతుడు రైతు, ఆయనకు భార్య ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

ఎన్‌హెచ్-44 రహదారిపై బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. చల్ల కుమారస్వామి అనే వ్యక్తి కర్నూలు వైపు వెళుతూ లిమ్రాస్ ఫంక్షన్ హాలు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడటతో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో 108 అంబులెన్స్ సిబ్బంది కర్నూలు ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. క్షతగాత్రుడు కర్నూలుకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు.

షెడ్డు దగ్ధం

పాములపాడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పాములపాడులో గ్రీస్, ఆయిల్ షాపు షెడ్డు ఆదివారం కాలిపోయింది. టీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ ఆవరణలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన మహేశ్ అనే వ్యక్తి వాహనాలకు సంబంధించిన గ్రీస్, ఆయిల్ స్పేర్ పార్ట్స్, గాలిమర, తదితర వస్తువుల షెడ్డు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకుంటున్నారు. ఆదివారం ఉదయం ఎవ్వరూలేని సమయంలో షెడ్డు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో మెత్తం వస్తువులు కాలిపోయాయని, రూ.4 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో విద్యార్థినికి తీవ్రగాయాలు

చాగలమర్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ విద్యార్థినికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కేపీతండా గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ధనకానాయక్, భీమాబాయి దంపతుల కుమార్తె రజితాబాయి. ఇంటివద్ద స్నేహితులతో కలిసి ఆడుకుంటూ నీళ్ల ట్యాంకు మెట్లు ఎక్కుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో విద్యుత్ షాక్ గురైంది. తీవ్రంగా గాయపడిన రజితను కుటుంబీకులు చికిత్సనిమిత్తం స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యంకోసం కడప వైద్యశాలకు తరలించారు. గ్రామంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని పలుమార్లు విద్యుత్ అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని గిరిజనులు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ తీగలను సవరించి ఇక ముందు ప్రమాదాలు జరుగకుండా చూడాలని గిరిజనులు కోరారు.

కాపు భవన్‌కు రూ.కోటి

- బీసీలు, కాపుల సంక్షేమానికి కృషి
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



ప్రసంగిస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కేంద్రంలో కాపు భవన్ నిర్మాణానికి రూ.కోటి ఇస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. ఆదివారం కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో బలిజ సంఘం ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ బీసీలు, మైనార్టీలతో పాటు కాపుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆయా వర్గాలు అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇటీవల కర్నూలులో బీసీ భవన్ నిర్మాణానికి రూ.కోటి సహకారం అందిస్తానని ప్రకటించానని గుర్తు చేశారు. అదేవిధంగా కాపు భవన్ నిర్మాణానికి సైతం కోటి రూపాయలు తన తరపున అందజేస్తానని తెలిపారు. ఇంకా అవసరమైతే ప్రభుత్వం తరపున సహకరిస్తామని చెప్పారు. అనంతరం కాపు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు జ్ఞాపికలను మంత్రి అందజేశారు.

అభివృద్ధిలో శరవేగంగా ఏపీ

గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెనక్కు వెళ్లిపోయాయని మంత్రి పేర్కొన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వ సహకారంతో అనతి కాలంలోనే అనేక పరిశ్రమలు తీసుకువచ్చామన్నారు. రాష్ట్రాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధిలో గుజరాత్ రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. గుజరాత్ రాష్ట్రం మాదిరి ఏపీలోనూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. గతంలో సీఎం చంద్రబాబు నాయుడు తన వద్దే పరిశ్రమల శాఖను ఉంచుకుని స్వయంగా పర్యవేక్షించారన్నారు. అంతటి కీలకమైన శాఖను తనపై నమ్మకంతో ఇచ్చారని, సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నా మన్నారు. హైకోర్టు తరహాలోనే కర్నూలులో ఏర్పాటు చేయబోయే హైకోర్టు బెంచ్ భవనం ఉంటుందని అన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని లేపాక్షి నుంచి కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కడప జిల్లా కొప్పర్తి వరకు పారిశ్రామిక హబ్ శరవేగంగా ఏర్పాటవుతోందన్నారు. అనంతరం మంత్రి టీజీ భరత్‌ను బలిజ(కాపు) సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు ఆర్వా రామకృష్ణ, పారిశ్రామికవేత్త అనంతయ్య, కాపునాడు అధ్యక్ష కార్యదర్శులు గాండ్ల లక్ష్మన్న, మండ్ల రవి, సోమశేఖర్, ఈశ్వర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బలిజ సంఘం నాయకులతో ప్రతిభ పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

సైకిల్ ర్యాలీ ప్రారంభం



జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న సెట్కూరు సీఈవో

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన సర్వీసుల శాఖ సెట్కూరు, డీఎస్ఏ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రైనింగ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవ ర్యాలీ జరిగింది. సెట్కూరు సీఈవో వేణుగోపాల్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీ నగరంలోని ఐదు కూడళ్లు, రాజ్‌విహార్, జిల్లా పరిషత్, పాత కంట్రోల్‌రూం మీదుగా వెళ్లి డీఎస్ఏ స్టేడియం చేరుకుంది. సీఈవో మాట్లాడుతూ ప్రపంచ సైకిల్ దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 3న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిట్ ఇండియా మిషన్ జూన్ 3న సైకిల్ ఆదివారాలు అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సాయ్ హాస్టల్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ మాట్లాడుతూ 25 వారాల పాటు సైక్లింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ సైకిల్ వాడకం తో కలిగే ప్రయోజనాలు వివరించారు. ర్యాలీలో నెహ్రూ యువ కేంద్ర అధికారి రాహుల్ రెడ్డి, ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, పీడీ పద్మావతి, యోగా అవినాశ్, హ్యాండ్‌బాల్ రుద్రారెడ్డి, కోచ్ కాశీరావు, కార్తికేయన్, కోచ్‌లు, విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య

సంగీత కళాశాలను ఏర్పాటు చేస్తాం

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య


నృత్యం చేస్తున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): టీజీవీ కళాక్షేత్రంలో ప్రైవేటు సంగీత కళాశాల ఏర్పాటు చేస్తామని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. గత నెల రోజులుగా కళాక్షేత్రంలో నిర్వహి స్తున్న బాల వెసని సాంస్కృతిక శిబిరం ఆదివారం రాత్రి ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా శిక్షణ పొందిన బాలబాలికలతో సంగీత, నృత్య, చిత్రలేఖన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించిన పత్తి ఓబులయ్య మాట్లాడుతూ నగరంలో సంగీత శిక్షణలకు వేల రూపాయలు ఖర్చు చేసుకోవాల్సి వస్తోందని, ఈ తరుణంలో కళాక్షేత్రంలో ఏర్పాటు చేయబోయే ప్రైవేటు సంగీత కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. తద్వారా ప్రజల్లో ఆదరణ కొరవడిన మన శాస్త్రీయ సంగీతానికి పూర్వవైభవం కల్పించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంగీత, నృత్య గురువులు ఎస్ కరీముల్లా, నాగరాజు, డి. వెంకట రమణలతోపాటూ కళాక్షేత్రం కార్యవర్గ సభ్యులు కె. బాలవెంకటేశ్వర్లు, శివయ్య, జీవీ శ్రీనివాసరెడ్డి, కేవీ రమణ, బీఎస్ఎన్ రమణ, గాండ్ల లక్ష్మన్న పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శించిన చిన్నారుల నృత్య రూపకాలు, సంగీత కార్యక్రమాలు ఆహుతులను అలరింపజేశాయి.

ఆరోగ్యమే మహాభాగ్యం: మాజీ ఎంపీ టీజీ

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం మూడో లిటిల్ మాస్టర్ స్విమ్మింగ్ కాంపిటీషన్ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ మాస్టర్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కల్లూరులో ఉన్న బీవీ రెడ్డి ఫంక్షన్ హాలులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా టీజీ వెంకటేశ్‌తోపాటు పారిశ్రామికవేత్త బీవీరెడ్డి హాజరై మాట్లాడారు. అండర్-18 వయసు పిల్లలకు, అండర్-18 మహిళలకు, స్విమ్మింగ్ పూల్‌లో ఫ్రంట్, బ్యాక్ స్ట్రోక్, ఫ్రీస్టైయిల్‌లో పోటీలను నిర్వహించామన్నారు. ఈపోటీలకు దాదాపు 150మంది పాల్గొన్నారు. అనంతరం క్రీడాకారులకు టీజీ వెంకటేశ్, బీవీ రెడ్డి, ఎంఎల్ శ్రీనివాసులు, రాజశేఖర్‌గౌడు, విఠల్ శెట్టి మెడల్స్, బహుమతులు అందజేశారు.

నేడు నగర పాలకలో వినతుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలుంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సమస్యను నిర్దేశిత గడువులోపు పరిష్కారం లభిస్తుందని, సమస్య పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు Meekosam. ap.gov. in వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

ఈత పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నరసరావుపేట 11వ సీనియర్ అంతర్ జిల్లా ఈత పోటీల్లో కర్నూలు జిల్లా ఈత క్రీడాకారులు ప్రతిభ చూపారు. జిల్లా క్రీడాకారులు వెంకటేశ్ 50 మీటర్లు, బ్యాక్ స్ట్రోక్ గోల్డ్, 50 ఫ్రీస్టైయిల్ గోల్డ్ 100 బ్యాక్ స్ట్రోక్ గోల్డ్, 40 ఫ్లై సిల్వర్, సౌమ్య తంజిన్ 50, 100, బటర్‌ఫ్లై, సిల్వర్ 200 ఇండివిజల్ మెడ్లెసిల్వర్ 50 మీటర్లు ఫ్రీస్టైల్ సిల్వర్ 200 ఫ్రీస్టైల్ గోల్డ్ పి.హేమలత 800 ఫ్రీస్టైల్ గోల్డ్, 100 మీటర్లు బ్రెస్ట్ స్ట్రోక్ సిల్వర్, 200 బ్యాక్ స్ట్రోక్ సిల్వర్ హేమంత్ 100 మీటర్లు బ్యాక్ బ్రాంజ్‌లలో విజేతలకు, టీం మెంబర్స్‌కు పల్నాడు జిల్లా కార్యదర్శి సుబ్బారెడ్డి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను కర్నూలు స్విమ్మింగ్ కోచ్ నటరాజరావు, కర్నూలు అక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరసింహచారి, రాము యాదవ్, ట్రెజరర్ దస్తగిరి, సహాయ కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శివరాజు, వెంకటేశ్వర్లు, రవి, అజితయ్య, రాఘవేంద్ర, శివ అభినందించారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా: ఎస్ఐ

సి.బెళగల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. ఆదివారం మండలంలోని బురాన్‌దొడ్డి, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లో ఎస్ఐ పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రౌడీ షీటర్లు రచ్చకట్ట పంచాయితీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్ఐ, పోలీసులు ఉన్నారు.

సమస్యల 'యార్డు'

- మార్కెట్ యార్డులో శిథిలమైన మరుగుదొడ్లు
- భరించలేని దుర్వాసన ● అరుగులు లేక పాట్లు
- లోపించిన పారిశుధ్యం ● నిరుపయోగంగా చెత్తకుండీలు
- ఆదాయం ఘనం.. నిర్వహణ నామమాత్రం

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ యార్డులో కేవలం పంట ఉత్పత్తుల విక్రయాలు ఒక సీజన్‌కే కాకుండా ఏడాది పొడవునా జరుగుతూనే ఉంటాయి. రైతులు తెచ్చే పంట ఉత్పత్తులపై ఖజానాకు దాదాపు 6కోట్ల నుంచి 7 కోట్ల వరకు సెస్సు రూపంలో ఆదాయం సమకూరుతోంది. అయితే రైతులకు వసతులు మాత్రం నామమాత్రంగానే ఉండటంపై ఆ రైతుల్లో ఆవేదన వ్యక్తం అవుతోంది. రైతులు తమ పంట ఉత్పత్తులను అమ్మేందు కోసం యార్డులో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. అరుగులు లేక నిలబడాల్సి పరిస్థితులు ఉన్నాయి. గతంలో కమీషన్ ఏజెంట్ల షాపుల ముందు అరుగులను కట్టించారు. ఏళ్ల తరబడి ఈ అరుగులకు మరమ్మతులు చేపట్టకపోవ డంతో ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరి కూర్చోవడానికి ఏ మాత్రం వీల్లేకుండా పోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్ యార్డులో ఉన్న అరుగులకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

లక్షలు ఖర్చుపెట్టి..

కర్నూలు మార్కెట్ యార్డులో వివిధ ప్రాంతాల్లో రైతుల కోసమని చెత్తాచెదారాన్ని పారబోసేందుకు లక్షలు ఖర్చు పెట్టి చెత్తకుండీలను ఏర్పాటుచేశారు. కూరగాయల మార్కెట్‌లో ఏర్పాటుచేసిన ఈచెత్తకుండీలను వ్యాపారులు ఎవరూ వినియోగించడం లేదు. ఎక్కడ పడితే అక్కడ చెడిపోయిన, కుళ్లిపోయిన కూరగాయలు పారబోస్తున్నారు. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. పశువులు, పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. పక్కనే ఉన్న ఉల్లిగడ్డల ప్లాట్‌ఫారంలో ఉన్న రైతులు రాత్రిపూట ఉండలేని పరిస్థితి నెలకొంది. కొంత మంది రైతులు దుర్వాసనకు, ఈగలు, దోమలతో అనారోగాల బారిన పడుతున్నారు. డీసీఎంఎస్ కార్యాలయం పక్కనే ఉన్న ప్రదేశం మరుగుదొడ్డిని తలపిస్తుంది. ఇక్కడ దాదాపు రూ.10 లక్షలు ఖర్చు చేసి మరుగుదొడ్లను నిర్మించారు. కనీసం నెల రోజులు కూడా వాటిని రైతులు ఉపయోగించలేని పరిస్థితి నెలకొంది. నాసిరకంగా నిర్మించడం వల్ల అవి ఎక్కువ కాలం ఉపయోగంలో లేకుండా పోయింది. ప్రస్తుతం వాటివల్ల దుర్వాసన వస్తోందని, దీని వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఆ మరుగుదొడ్లను, టాయిలెట్లను తొలగించి శుభ్రం చేయించాలని రైతులు కోరుతున్నారు.



మార్కెట్ యార్డులో రైతులు కూర్చునే అరుగు దుస్థితి, శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు


కర్నూలు మార్కెట్ యార్డులో పేరుకుపోయిన చెత్త

మరమ్మతులు చేపడుతాం

కర్నూలు మార్కెట్ యార్డులో తమ పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు వేలాదిగా రైతులు తరలివస్తున్నారు. వివిధ కారణాల వల్ల నిధుల లేమిచో కొన్ని సౌకర్యాల కొరత ఉన్న మాట వాస్తవమే. అరుగులతో పాటు మరికొన్ని సౌకర్యాలను రైతులకు అందించేందుకు పై అధికారుల అనుమతి తీసుకుంటున్నాము.

- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కోడుమూరు ఎమ్మెల్యే
- చౌకదుకాణాల్లో రేషన్ పంపిణీ

కర్నూలు రూరల్ జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు మండలం పసుపుల, నూతనపల్లె గ్రామాల్లో ఆదివారం చౌక దుకాణాలను ఎమ్మెల్యే ప్రారంభించి, రేషన్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు అవకతవకలకు పాల్పడకుండా ప్రజలకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ వెంకటరమేష్‌బాబు, వీఆర్వో, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: నగరంలోని 14, 15, 16 డివిజన్లలో రేషన్ దుకాణాలను తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్‌తో కలిసి మాజీ కార్పొరేటర్లు రామంజనేయులు, పామన్న, విజయకుమారిలు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.జగన్నాథం, డీలర్ హనుమంతరావు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లులో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు రాంభూపాల్ రెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, అన్వర్‌బాషా కార్డుదారులకు రేషన్ పంపిణీ చేశారు. అదేవిధంగా హుశేనాపురం, నన్నూరు, తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు, అధికారులు రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాల్వబుగ్గ మాజీ చైర్మన్లు చంద్రపెద్దస్వామి, సుధాకర్, తహసీల్దార్ విద్యాసాగర్, టీడీపీ నాయకులు విశ్వేశ్వరరెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

గూడూరు: గూడూరులో రేషన్ కార్డుదారులందరికీ పట్టణ టీడీపీ అధ్యక్షుడు, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కె రామాం జనేయులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. టీడీపీ నాయ కులు రేమట వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు రేమట సురేష్, కోడుమూరు షాషావలి, ఎల్లయ్య, చాంద్‌బాషా, కురువ హనుమంతు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలోని సి.బెళగల్ తదితర గ్రామాల్లో తహసీల్దార్ పురుషోత్తం అధ్యక్షతన మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, అమర్ చౌకదుకాణాలను ప్రారంభించారు. నాయకులు బాలాజీ వెంకటేశ్, నల్లన్న, డీలర్లు పాల్గొన్నారు.


పసుపులలో రేషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి


హుశేనాపురంలో బియ్యం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కళాకారులకు ప్రభుత్వ సహకారం అవసరం


తిరుపాలును సత్కరిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కళాకారులకు ప్రభుత్వ సహకారం అవసరమని పలువురు కళాకారులు అన్నారు. ఆదివారం నగరంలోని మద్దూరునగర్ లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో కర్నూలుకు చెందిన ప్రముఖ నటుడు, కందుకూరి పురస్కార గ్రహీత కళాప్రియ తిరుపాలును ఘనంగా సత్కరించారు. జిల్లా కేంద్రంలో పాతబస్టాండ్ సమీపంలోని మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను కూల్చివేసే సమయంలో తమకు కొత్త ఆడిటోరియం కట్టిస్తామని నేతలు హామీలిచ్చారని, నేడు ఆఊసేలేదని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు కళాకారులకు ఒక శాశ్వత ప్రభుత్వ ఆడిటోరియంను నిర్మించి ఇచ్చేలా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్ర మంలో తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ రాష్ట్ర కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ, జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ జీఎస్ఎం సుభాన్, లలిత కళాసమితి మాజీ అధ్యక్షుడు పి. దస్తగిరి, కర్నూలు కళాకారుల సేవా కేంద్రం అధ్యక్షుడు బైలుప్పల షఫీయుల్లా, హనుమాన్ కళాసమితి సంస్థ అధ్యక్షుడు, టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పెనికలపాటి హనుమంతరావు చౌదరి, విశ్రాంత తహసీ ల్దార్లు సయ్యద్ రోషన్‌ఆలీ, సి.అజయ్‌కుమార్, కళాకారులు గోవిందరాజులు, నాగేశ్వరరావు, నాగేషు, డాక్టర్ నగేష్, షేక్షావలి, సర్దార్, సిద్దిక్ బాషా, డి.పార్వతయ్య, శారదమ్మ, నారాయణ, నిర్మల, ముంతాజ్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కర్నూలు రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణానికి చెందిన తెలుగు శ్రీనివాసులుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కును ఆదివారం కర్నూలులో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అందజేశారు. శ్రీనివాసులు కొంతకాలంగా లివర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆ వ్యాధి నయం చేయించుకునేందుకు అవస రమైన డబ్బులు లేనందున సాయం కోసం ఎమ్మెల్యే దస్తగిరిని కలిశారు. ఈనేపథ్యంలో శ్రీనివాసులుకు ఎమ్మెల్యే ధైర్యం చెప్పి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జబ్బును నయం చేయించుకునేందుకు రూ.10లక్షలు మంజూరు చేయించారు. మంజూరైన ఎల్‌వోసీ చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా శ్రీనివాసులుకు అందజేశారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబునాయుడికి, కోడుమూరు ఎమ్మెల్యేకు శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు.

'బొప్పరాజుపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

కర్నూలు కలెక్టరేట్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుపై వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఏపీ వీఆర్వోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. వీఆర్వోలను మోసపూరిత ప్రకటనలతో భూపతిరాజు మోసం చేసిన విషయం ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. భూపతిరాజు, నోరు అదుపులో పెట్టుకుని మాట్లా డాలని, స్థాయిని మరిచి చౌకబారు విమర్శలు చేస్తే ఊరుకోమని అన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ అధికారుల సమస్యలను పరిష్కారం చేస్తుందన్నారు. బొప్పరాజు నిరంతరం కృషిని చూసి ఓర్వలేక వారిని నేరుగా ఎదుర్కొనే దమ్ము లేక చౌకబారు విమర్శలు చేస్తున్నారన్నారు.

ముగిసిన సమ్మర్ చౌక్‌బాల్ క్యాంపు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో గత నెల రోజులుగా నిర్వహించిన సమ్మర్ చౌక్‌బాల్ క్యాంపు ముగిసింది. ముఖ్యఅతిథులుగా జిల్లా క్రీడల అభివృద్ధి అధి కారి భూపతిరావు, న్యాయవాది శ్రీధర్ రెడ్డి, ఏఆర్ఎస్ఐ నాగస్వామి హాజరై మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుంద న్నారు. కోచ్ మహేష్, చౌక్‌బాల్ కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ


గుర్తింపు కార్డులను అందజేస్తున్న జనసేన నాయకులు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాయలసీమ జోనల్ కన్వీనర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పలు వార్డులకు చెందిన జనసైనికులు, వీర మహిళలకు ఆయన కార్యాలయంలో గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావస్తున్న నేపథ్యంలో రాష్ట్రాభివృద్ధిలో జనసేన పాత్ర, భవిష్యత్తు ప్రణాళిక తదితర అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అనంత కరుణాకర్‌బాబు, సుజాత, దేవరాజు, మహబూబ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'డీఎస్సీ అభ్యర్థుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలి'

కర్నూలు న్యూసిటీ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని, పరీ క్షకు 90 రోజుల గడువు ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యువగళం పాదయా త్రలో మంత్రి నారా లోకేశ్ వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, అసలు నిరుద్యోగులను అక్రమ అరెస్టులు చేస్తూ నిర్బంధిస్తున్నారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు వారి సమస్యలు చెప్పుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, ఉప న్యాసాలు ఇచ్చారని తర్వాత మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 11 నెలల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి 45 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించాలంటున్నారని, డీఎస్సీ అభ్యర్థులకు గడువు సమయం 90 రోజులకు పొడిగించాలని, వయోపరిమితి 47కు పెంచాలని డిమాండ్ చేశారు. హాల్‌టికెట్ల విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా మే 30 నుంచి డౌన్‌లోడు కావాల్సి ఉండగా.. పలు కారణాలతో 31 నుంచి డౌన్‌లోడు అయ్యాయని అన్నారు. దీంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారని అన్నారు.

ఒలింపిక్ డేను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రామాంజనేయులు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న జరగనున్న ఒలింపిక్ డేను విజయవంతం చేయాలని జిల్లా క్రీడా సంఘాలు పిలుపునిచ్చాయి. ఆదివారం కర్నూలు క్లబ్‌లో జిల్లా ఒలింపిక్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ గత ఏడాదిలో సంఘం ఆధ్వర్యంలో విగ్రహం ఆవిష్కరణ, క్రీడా సంఘాల ఆధ్వర్యంలో పరుగు, విద్యార్థులకు క్రీడా పోటీలు, ఉపాధ్యాయులకు సత్కారం, ఉద్యోగ మహిళలకు మహిళా దినోత్సవంలో పురస్కారం అందించడంలో అసోసియేషన్ కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షవర్ధన్, షేక్షావలి, నాగరత్నమయ్య, దాసరి సుధీర్, ఎంఎండీ బాషా, కోలా ప్రతాప్, గుడిపల్లి సురేందర్, వై.శ్రీనివాసులు, నబీ సాహెబ్, కుమార్, పరుశురాముడు, విజయకుమార్, వేణుగోపాల్, ప్రభాకర్, షకీల్, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, చిన్న సుంకన్న, సువర్ణ, జాఫర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని టీడీపీ 22వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి బొల్లెద్దుల సాయి పవన్ కాంత్ అన్నారు. ఆదివారం నగరంలోని కొండారెడ్డి బురుజు కేఎంసీ పార్కులో సమ్మర్ క్యాంపులో తైక్వాండో విజేతలకు బహుమతుల ప్రదా నోత్సవ కార్యక్రమం జరిగింది. విజేతలకు సాయి పవన్ కాంత్ మెడల్స్‌తో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. తైక్వాండో కోచ్ సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తైక్వాండో విద్యార్థులు అభి, చిత్ర, పండు, హేమలత, జాహ్నవి, సంజిత్, మనిషా, శివమణి, కౌశిక్, రుషి, మల్లేష్, భార్గవ్, లలిత, అశ్విని, రాఘవ, హరి, భవిత, స్వాతి, అఖిల్, సాయి, సుదీప్ బంగారు, సిల్వర్, బ్రౌంజ్ పతకాలు సాధించారన్నారు.

ఎంపీ బస్తిపాటి నాగరాజు జన్మదిన వేడుకలు

కర్నూలు అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌నగర్‌లోని పట్టణ నిరాశ్రయుల గృహంలో కురువ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపీ జన్మదిన వేడుకల సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య ఎంపీ సతీమణి జయసుధ కేక్ కట్ చేశారు. అనంతరం నిరాశ్రయులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అంతకు ముందు ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ నాయకులు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పెద్దపాడు రోడ్డులోని బీరప్ప స్వామి ఆలయ ప్రాంగణం లో ఎంపీ బస్తిపాటి నాగరాజు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, పాల సుంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు పెద్దపాడు ధనుంజయ, బి.వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షులు తవుడు శ్రీనివాసులు, అల్లూరు వెంకటేశ్వర్లు, కే.వీరన్న, పెద్దపాడు వెంకటేశ్వర్లు, బత్తిన సుధాకర్, కే.భీరప్ప, కే.రంగస్వామి పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జె సురేష్, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ కురువ వెంకటరాముడు, టీడీపీ నాయకులు గోపాల్ రెడ్డి, ఎంపీటీసీ మద్దిలేటి, కర్లం చిన్న గిడ్డయ్య, సుంకన్న పాల్గొన్నారు.

మతమార్పిడి ఒత్తిళ్లను ఖండిస్తున్నాం


మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వాల్మీకి, బోయ కులానికి చెందిన డాక్టర్ శ్రీకాంత్‌పై జరుగుతున్న మత మార్పిడి ఒత్తిళ్లను తీవ్రంగా ఖండిస్తున్నామని వాల్మీకి సంక్షేమ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు తలారి కృష్ణ, వాల్మీకి బోయ సేవా సంస్థ వ్యవస్థాపకుడు కుబేరస్వామి, రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ మురళీ నాయుడు, భారతీయ వాల్మీకి సేవ సేత ఉల్చాల లక్ష్మణ్ నాయుడు అన్నారు. ఆదివారం వాల్మీకి సేవా సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డాక్టర్ శ్రీకాంత్ ఆయన భార్య (ఇస్లాం మతానికి చెందినవారు) గత 12 ఏళ్లుగా పరస్పర ప్రేమతో 2000లో వివాహం చేసుకున్నారు. ఇటీవల ఆయనకు కూతురు జన్మించిందన్నారు. శ్రీకాంత్ భార్య తల్లిదండ్రులు, బంధువులు కలిసి మానసికంగా ప్రభావితం చేసి శ్రీకాంత్‌ను మతం మారాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు పెద్దయ్య, బేతం కృష్ణుడు, రామనాయుడు, లక్ష్మీనారాయణ, సుకుమార్, మల్లన్న పాల్గొన్నారు.

విత్తనాల కోసం నమోదు చేసుకోండి

తుగ్గలి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఏవో పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ మండలానికి 1,605 క్వింటాళ్ల వేరుశనగ, 30 క్వింటాళ్ల కందులు, 11 క్వింటాళ్ల మినుములు, 5 క్వింటాళ్ల కొర్రలు, క్వింటం పచ్చిరొట్ట విత్తనాలు వచ్చాయన్నారు. వేరుశనగ మార్కెట్‌లో ధర రూ.9,300లు కాగా సబ్సిడీ రూ.3,720లు పోను రూ.5,580లు రైతులు చెల్లించాలని ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలి

● జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాటం ప్రకాష్


పిల్లలతో మాట్లాడుతున్న ప్రకాష్

ఆలూరు రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలి అలవరచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాటం ప్రకాష్ సూచించారు. ఆదివారం ఆలూరు గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ ఓరియంటేషన్‌ను పరిశీలించారు. పిల్లల్లో పుస్తక పఠనంతో సృజనాత్మకతను వెలికితీయడానికే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశా మన్నారు. అనంతరం విద్యార్థులకు కథలు చెప్పి వారి చేత కథ చెప్పించి పుస్తక పఠనం చేయించారు. విద్యార్థులు కార్యదర్శి ప్రకాష్‌ను డ్రాయింగ్స్‌చే సన్మానించగా, వారికి ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలూరు గ్రంథాలయ అధికారి కె.విజయభాస్కర్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్వేతపత్రం విడుదల చేయాలి


నూర్ అహ్మద్

ఆదోని, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పార్థసారథి తన ఏడాది పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఒకవైపు సీఎం అభివృద్ధి బాటలో పరుగులు పెట్టిస్తున్నా, ఆదోనిలో మాత్రం అభివృద్ధి లేదన్నారు. ఏడాదిలో ఎంతమంది అవినీతిపరులు, భూకబ్జాదారులపై కేసులు నమోదు చేశారని ప్రశ్నించారు. పట్టణాన్ని ఎంత అభివృద్ధి చేశారంటూ ప్రశ్నించారు. టూరిస్టులా వచ్చి వెళుతున్నారని ఆదోని ప్రజలు అన్ని గమనిస్తున్నారని ఇప్పటికైనా ఎమ్మెల్యే చంద్రబాబు బాటలో నడిచి ఆదోనిని అభివృద్ధి చేయాలని కోరారు.

సూపర్ సిక్స్‌ను అమలు చేయాలి

● సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య

ఆస్పరి, జూన్1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆస్పరిలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఏ ఒక్క పథకంఅమలు చేయలేదన్నారు. అన్నదాతకు పెట్టుబడి సాయం అందలేదని, గ్రామాల్లో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు. వెనుకబడిన ఆస్పరి మండలంలోని అన్ని చెరువులను నీటితో నింపాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపుకార్డు మంజూరు చేసి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు మంజూరు చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, తిమ్మయ్య, విరుపాక్షి, రాజశేఖర్, బ్రహ్మయ్య, ఆంజనేయ, శివన్న, బడేసాబ్, రంగన్న, రామాంజనేయులు, సోమన్న, దస్తగిరి, హనుమంతు, చంద్ర, రమేష్, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

'హామీలతో మోసం చేసిన టీడీపీ'


పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అబద్దపు హామీతో టీడీపీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం తన నివాసంలో ఈనెల 4న వైసీపీ తలపెట్టిన వెన్నుపోటు దినోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. నిరుద్యోగుకు 10 లక్షల ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రుణమాఫీ, రైతు భరోసా నిరుద్యోగ భృతిని విస్మరించిందన్నారు. మాట నిలబెట్టుకోకుండా పాలించడమే టీడీపీ ప్రభుత్వ వెన్ను పోటని విమర్శించారు. 4వ తేదీన నిర్వహించే వెన్నుపోటు దినోత్సవ నిరసనకు కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్‌లు అశోక్, చలపతి, నాయకులు దేవదాస్, దేవా, నల్లారెడ్డి పాల్గొన్నారు.

తాగేదెలా..?


తాగునీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్ర వాతావరణం


ట్యాంకులో ఉన్న వేర్లను చూపుతున్న గ్రామస్థులు

హొళగుంద, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగరకణివి మజరా గ్రామం హొన్నూరు గ్రామంలోని తాగునీటి ట్యాంక్ పాచిపట్టింది. నాగరకణివి గ్రామం నుంచి పైపులైన్ ద్వారా ట్యాంకుకు నీరు వస్తోంది. అయితే ఏడాది నుంచి ట్యాంకును శుభ్రం చేయడం లేదని గ్రామస్థులు సురేష్, గాదిలింగ, కాళింగ, శ్రీనివాసులు, మంజునాథ్ వాపోతున్నారు. ట్యాంకు పరిసరాల్లో పాచి పట్టిందని, ట్యాంకులో పురుగులు, చెత్తాచెదారం ఉన్నాయని నీరు దుర్వాసన వస్తోందన్నారు. ఈ విషయపై ఈవోఆర్డీ చక్రవర్తిని వివరణ కోరగా గ్రామంలోని నీటి ట్యాంకు శుభ్రం చేయిస్తామని తెలిపారు.

యోగాతో ఆరోగ్యం

క్రిష్ణగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం వస్తుందని ఎమ్పీడీవో మోహన్ కుమార్ అన్నారు. ఆదివారం క్రిష్ణగిరిలో యోగా శిక్షణ, పోటీలు నిర్వహించారు. ఈవోఆర్డీ లచ్చప్ప తదితరులు ఉన్నారు.

'ఉపాధి' వేతనాలు చెల్లించాలి

తుగ్గలి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఉపాధి వేతనాలను చెల్లించాలని కార్మిక సంఘం నాయకుడు రంగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మారెల్ల గ్రామంలో మాట్లాడుతూ కూలీలకు రెండు నెలలుగా వేతనాలు రాలేదని, పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఉపాధి పనులకు కూలీలు ఎలా వెళ్తారని ప్రశ్నించారు.

ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ లక్ష్యం


పత్తికొండలో రేషన్ పంపిణీని ప్రారంభిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్


తుగ్గలిలో పరిశీలిస్తున్న ఆర్డీవో, తుగ్గలి నాగేంద్ర


దేవనకొండ: జిల్లెలబుడకలలో రేషన్ పంపిణీ

పత్తికొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవచేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకే చౌక దుకాణాల ద్వారా సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టిందని ఆర్డీవో భరత్‌నాయక్, తహసీల్దార్ రమేశ్ అన్నారు. టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షులు సురేశ్ ఆధ్వర్యంలో 10వ దుకాణంలో ఆదివారం సరుకుల పంపి ణీని ప్రారంభించారు.

తుగ్గలి: కార్డుదారులందరికీ రేషన్ ఇవ్వాలని పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ డీలర్లను ఆదేశించారు. ఆదివారం రాతన, తుగ్గలిలోని రేషన్ దుకాణాలను తహసీల్దార్ రమాదేవి, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరితో పాటు రేషన్ పంపిణీని ప్రారంభించారు.

వెల్దుర్తి: డీలర్ల ద్వారా ప్రభుత్వం సరుకులను పంపిణీ చేస్తోందని తహసీల్దార్ చంద్రశేఖరవర్మ అన్నారు. ఆదివారం వెల్దుర్తిలో టీడీపీ నాయకుడు సుబ్బరాయుడు, బలరాంగౌడ్, జ్ఞానేశ్వర్‌గౌడ్, రమాకాంత్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో లబ్దిదారులకు సరుకులు అందజేశారు. డీటీ గురుస్వామి, ఆర్ఐ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: కార్డుదారులకు రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ప్రసాదురాజు, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు సూచించారు. మండలంలోని జిల్లెలబుడకలలో ప్రారంభిం చారు. కన్వీనర్ విజయ్ ఉన్నారు.

మద్దికెర: కార్డుదారులకు బియ్యాన్ని సక్రమంగా ఇవ్వాలని పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మాజీ జడ్పీటీసీలు పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, తహసీల్దార్ హుశేన్ సాహెబ్ సూచించారు. ఆదివారం మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామంలో బియ్యం పంపిణీ ప్రారంభించారు.

క్రిష్ణగిరి: నిబంధనల మేరకు రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలని పత్తికొండ మార్కెట్ యార్డు చైర్మన్ ఆలంకొండ నబీ సాహెబ్ సూచించారు. ఆదివారం ఆగవేళి గ్రామంలో తహసీల్దార్ లక్ష్మణ్ రాజ్‌తో కలసి రేషన్ పంపిణీని ప్రారంభించారు. టీడీపీ నాయకులు గురుస్వామి, మహమ్మద్ రఫీ, వెంకటేష్ గౌడ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

● నాటి గురువులకు ఘన సన్మానం


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్లే మల్లేశప్ప కన్నడ (వైఎంకె) ఉన్నత పాఠశాల 1995-96 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహిం చారు. 30 ఏళ్ల తర్వాత ఒకేచోట పూర్వ విద్యార్థులు కలుసుకుని, స్నేహితులను ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. తాము చదివిన తరగతి గదిలో కూర్చొని స్నేహితులతో నాడు చేసిన అల్లర్లను జ్ఞాపకం చేసుకున్నారు. తమ ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్ఎంలు నాగరాజు, రత్నం, ఉపాధ్యాయులు మల్లికార్జున, ఎల్లప్ప, ఉమాశంకర్, ప్రతాప్ సూర్య, ఈరలింగప్ప, ఈశ్వరయ్యను సన్మానించారు. పూర్వ విద్యార్థులు వీరసేన, నాగరాజు, రాము, రంగప్ప, చంద్రశేఖర్, అయ్యాలప్ప, రంగారావు, కృష్ణవేణి, సునీత, భువనేశ్వరి, శంకమ్మ, గౌరమ్మ, ఈరమ్మ పాల్గొన్నారు.

ఇక ఉన్నత పాఠశాలగా..

● హంప గ్రామం ఎంపీపీ పాఠశాలను జడ్పీ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం


ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిన పాఠశాల

మద్దికెర, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హంప ప్రభుత్వ పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేశారు. ఇప్పటిదాకా 8వ తరగతి వరకు మాత్రమే ఉండగా 2025-26 విద్యాసంవత్సరానికి పదో తరగతి వరకు పెంచడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో దాదాపు 3వేల మంది ఉన్నారు నివసిస్తున్నారు. ప్రభుత్వం ప్రాథమికోన్నత పాఠశాలను ఏర్పాటు చేసి, 1 నుంచి 8వ తరగతి వరకు ఏర్పాటు చేసింది. పాఠశాలలో 153 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ ఏడాది పాఠశాలను జిల్లా పరిషత్ పాఠశాలగా మార్పు చేశారు. ఉపాధ్యాయులను పదోన్నతి ద్వారా భర్తీ చేయనున్నారు. దీంతో సమీపంలోని గ్రామాల విద్యార్థులు ఈ పాఠశాలలో చేరే అవకాశముంది. హంప గ్రామంతో, సమీప గ్రామాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పదో తరగతి వరకు పెంచడం మేలు



ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా పెంచడం విద్యార్థులకు మేలు. దీంతో హాజరు శాతంపెరిగే అవకాశముంది. -ఫక్రుద్దీన్, హంప గ్రామం

పిల్లలను చేర్పించండి



ఎంపీపీ పాఠశాలను జడ్పీ పాఠశాలగా మార్చాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిం చాలి. అన్ని వసతులతో పాటు మెరుగైన విద్య ఇస్తాం. - రంగస్వామి, ఎంఈవో

బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంలు


హెచ్ఎం ఫయాజుద్దీన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎంలుగా పదోన్నతి పొందిన వారు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం సీనియర్ స్కూల్ అసిస్టెంట్లలకు పదోన్నతి ఇచ్చి, అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలకు హెచ్ఎం లుగా నియమించింది. మున్సిపల్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యా యుడు ఫయాజుద్దీన్ నెహ్రూ ఉన్నత పాఠశాలకు, హెచ్ఎంగా పదోన్నతి పొందారు. ఇక్కడ పనిచేస్తున్న హలీం సిద్ధికిని అండర్ పేట ఉర్దూ బాలికల ఉన్నత పాశలాలకు బదిలీ చేశారు. ఇక ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలకు కె.రవి, కల్లుబావి పురపాలక ఉన్నత పాఠశాలకు కె.గిరిబాబు, కిల్చిన్‌పేట ఉన్నత పాఠశాలకు బి ఉరుకుందప్ప, ఆష్మియా ఉర్దూ పురపాలక ఉన్నత పాఠశాలకు నూర్ భాషా హెచ్ఎంలుగా బాధ్యతలు తీసుకున్నారు. వీరిని ఎస్టీయూ యూటీఎఫ్, నాయకులు, ఉపాధ్యాయులు సన్మానించారు. మున్సిపల్ హై స్కూల్ హెచ్ఎం మల్లికార్జున ఎస్టీయూ నాయకులు రమేష్ నాయుడు, లోక్య నాయక్, సుధాకర్ బాబు, వీరచంద్ర యాదవ్, యుటీ ఎఫ్ మాజీ రామనాయుడు కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి జీవిత, నరసయ్య గౌడ్, ఉపాధ్యాయులు అనిల్, బసవరాజు, ప్రహల్లాద, భీమరాజు, మల్లికార్జున, విశ్రాంత హెచ్ఎంలు మోహన్‌రావు, హనుమంతు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి


నాగార్జునరెడ్డి(ఫైల్)

పత్తికొండ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూటూరు గ్రామ ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ నాగార్జునరెడ్డి (28) ఆదివారం మృతి చెందాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, టీడీపీ నాయకులు విజయ మోహన్ రెడ్డి, సిబ్బంది నివాళి అర్పించారు.

రేషన్‌ను సకాలంలో ఇవ్వాలి: సబ్ కలెక్టర్



సరుకుల పంపిణీ పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, సరుకులు ఇస్తున్న మీనాక్షి నాయుడు

ఆదోని, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): డీలర్లు కార్డుదారులకు సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ నగర్ కాలనీ షాప్ నెంబర్ 62లో రేషన్ పంపిణీని ప్రారంభించారు. దుకాణం వద్ద క్యూ ఆర్‌కోడ్ ఏర్పాటు చేశామని, ప్రజలు వారి అభిప్రాయాలు తెలియచేయాలన్నారు. తహసీల్దార్ శివ రాముడు, సీఎస్‌డీటీ వలిబాషా, రీ సర్వే డీటీ పెద్దయ్య పాల్గొన్నారు.

● పేదలకు నాణ్యమైన సరుకులు ఇవ్వడమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలోని నారాయణగుంత కాలనీలోని దుకాణంలో రేషన్ పంపిణీని ప్రారంభించారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, కురువ సంఘం నాయకులు మల్లికార్జున, కృష్ణ, శాంతమూర్తి, సిద్ద, రవి, వీరేష్ పాల్గొన్నారు.

ఆస్పరి: రేషన్ దుకాణాన్ని తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. మండలంలో 39 రేషన్ దుకాణాలు ఉన్నాయని, మొత్తం 19,613 రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు.

దంత వైద్యుడి మృతి

● కుటుంబ సభ్యులను పరామర్శించిన కోట్ల, టీడీపీ నాయకులు


పరామర్శిస్తున్న కోట్ల, ఇన్‌సెట్లో వినోద్‌కుమార్(ఫైల్)

పత్తికొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు అట్ల ప్రమోద్‌కుమార్‌రెడ్డి సోదరుడు, దంతవైద్యుడు అట్ల వినోద్‌కుమార్‌రెడ్డి (54) మృతిచెందారు. కొద్దిరోజులుగా కాలేయ వ్యాధితో హైదరాబాదులో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మరణించారు. మృతుడి తండ్రి మనోహర్‌రెడ్డి పట్టణంలో న్యాయవాది. ఆయనకు భార్య మాధవి లతతో పాటు కుమారుడు సుహాశ్‌హరిరెడ్డి, కూతురు సుచిత్రరెడ్డి ఉన్నారు. విషయం తెలుసుకున్న కేంద్ర మాజీ మంత్రి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, పత్తికొండ టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, బత్తిన వెంకటరాముడు, చల్లా రవీంద్రనాథ్ చౌదరి, అనంతపురం అనంతవెంకటరెడ్డి, వైకుంఠం మల్లికార్జున, వైసీపీ నాయకుడు రామచంద్రారెడ్డి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు

బియ్యంలో కోత

● హొళగుందలో వేయింగ్ మిషన్‌పై ఖాళీ సంచులు ఉంచిన డీలర్


వేయింగ్ మిషన్‌పై గొనె సంచి

హొళగుంద, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్ దుకాణాలకు కార్డుదారులు ఉదయమే వచ్చారు. డీలర్లు సరుకు నిల్వలు, ఇతర వివరాలు ఫ్లెక్సీ రూపంలో ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుండి 12 వరకు, సాయంత్రం 4గంటల నుండిరాత్రి 8 గంటల వరకు ఈ నెల 15వ తేదీ వరకు రేషన్ సరుకుల పంపిణీ సాగుతుందని రేషన్ డీలర్లు తెలిపారు. అయితే కొందరు డీలరుల డిజిటల్ వేయింగ్ మిషన్‌పై గోనె సంచులు ఉంచి బియ్యం పంపిణీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేజీ వరకు బియ్యం తక్కువ వచ్చిందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ నిజాముద్దీన్‌ను వివరణ కోరగా వేయింగ్ మిషన్‌పై వస్తువులు ఉంచకూడదని, ఫిర్యాదు వస్తే డీలర్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిరసనకు తరలిరండి


పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఆలూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4న వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు వెన్నుపోటు దినం నిరసనకు తరలిరావాలని ఎమ్మెల్యే విరుపాక్షి సోదరుడు బుసినే వెంకటేష్ పిలుపునిచ్చారు. ఆదివారం వైసీపీ కార్యాలయంలో వెన్నుపోటు దినం పోస్టర్లను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడచినా హామీలు ఎంతవరకు అమలు చేశారని ప్రశ్నించారు. దేవనకొండ జెడ్పీటీసీ కిట్టు, కన్వీనర్లు మల్లికార్జున, షఫీ, ఎంపీటీసీ దేవరాజు, కో ఆప్షన్ సభ్యులు బాషా, భాస్కర్, అరికెర వెంకటేశ్వర్లు, సోమశేఖర్, రాజు, మల్లికార్జున, జాన్, తిక్కస్వామి, ఎల్లప్ప, రామలింగ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● ఎడవలి పంచాయతీ కార్యదర్శి పరమేశ్వరప్ప



మద్దికెర, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని ఎడవలి గ్రామ పంచాయతీ కార్యదర్శి పరమేశ్వరప్ప తెలిపారు.

ప్రశ్న: పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారా?
జవాబు: ఎమ్మెల్యే శ్యాంబాబు, సర్పంచ్ కల్పన సహకారంతో గ్రామంలో దాదాపు రూ.15 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేశాం.
ప్రశ్న: దోమల నివారణకు చర్యలు తీసుకున్నారా..?
జవాబు: ఎడవలి గ్రామంతో పాటు ఇన్‌చార్జిగా ఉన్న బసినేపల్లి, మదనంతపురం గ్రామాల్లో మురుగు కాలువల్లో పూడిక తీయించి, బ్లీచింగ్ పౌడర్‌తోపాటు, మందులు కూడా పిచికారీ చేయించాం.
ప్రశ్న: తాగునీటి ట్యాంకును ఎన్నిరోజులకోసారి శుభ్రం చేయిస్తున్నారు.?
జవాబు: 15 రోజులకోసారి శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయిస్తున్నాం.
ప్రశ్న: వీధిలైట్లు ఉన్నాయా?
జవాబు: వీధిలైట్లు వేయిస్తున్నాం.
ప్రశ్న: మదనంతపురం గ్రామంలో మురుగు రోడ్డుపైకి వస్తోంది కదా?
జవాబు: రోడ్డుపైకి మురుగు వదిలే వారికి నోటీసులు ఇస్తాం. పాడైన కాలువలకు మరమ్మతులు చేయిస్తాం.
ప్రశ్న: వర్షాకాలంలో జాగ్రత్త తీసుకుంటున్నారా?
జవాబు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోకున్నాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
ప్రశ్న: మదనంతపురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైందా?
జవాబు: తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించి గ్రామానికి నీరందిస్తాం.

కుంగుతున్న కుడి కాలువ గట్టు

● సగంలోనే ఆగిపోయిన ఎడమ కాలువపై బ్రిడ్జి పనులు
● ప్రమాదకరంగా జీడీపీ కుడి, ఎగమ కాలువ కల్వర్టులు
●రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు


రక్షణ గోడలు లేకపోవడంతో మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టు కుడి కాలువ కల్వర్టు


కుంగిపోయిన జీడీపీ కుడి కాలువ గట్టు రాతి కట్టడం

గోనెగండ్ల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు కాలువ మలుపు దగ్గర ఉన్న కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. కాంట్రాక్టర్లు ముందు చూపు లేకుండా కాలువ గట్లకు ఉన్న ప్రహరీని తొలగించి దాదాపు మూడేళ్లు అవుతోంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. కాంట్రాక్టర్, అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోకుండా కాలువ గట్లకు ఉన్న రాతి కట్టడాన్ని ఎందుకు తొలగించారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. దీంతో కల్వర్టు దగ్గర మలుపును ప్రమాదాన్ని సూచించే బోర్డులు గానీ, రేడియం స్టిక్కర్లు గానీ లేక పోవడంతో రాత్రి పూట ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లిగుండ్ల, నెరుడుప్పల, బండగట్టు, ఎర్రబాడు, ఒంటేడుదిన్నె, గ్రామాలకు ఇదే దారి వెంట వెళ్లాల్సి ఉంది. ఈ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆటోలలో ప్రతి రోజు ఇదే దారి వెంట పాఠశాలకు వెళ్తుంటారు. మూడేళ్ల క్రితం మలుపు దగ్గర ఆటో బోల్తా పడి విద్యార్థి మృతి చెందిన ఘటన జరిగింది. పత్తికొండ, దేవనకొండ మండలాలకు చాల మంది ఇదే దారి వెంట వాహనాల్లో వెళ్తుంటారు. ఈ రోడ్డు రద్దీగానే ఉంటుంది. జీడీపీ కట్ట ఎత్తు పెంచే కాంట్రాక్టర్ ముందు జాగ్రత్తలు పాటించకుండా జీడీపీ కుడి, ఎడమ కాలువలకు ఉన్న కల్వర్టులరాతి కట్టడాన్ని తొలగించడం తో రాత్రిపూట మలుపుల దగ్గర ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే గత కొన్ని నెలల క్రితం ఎడమ కాలువ కు చెందిన కల్వర్టు దగ్గర కొత్తగా చిన్న బ్రిడ్జిని నిర్మించారు. అయితే నిధులు విడుదల కాకపోవడంతో పనులు సగంలోనే నిలిపి వేశారు. ఎడమ కాలువ మలుపు దగ్గర తాత్కాలిక ప్రహరీని నిర్మించడం మరిచారు.


ప్రహరీ లేని ఎడమ కాలువ కల్వర్టు

కుంగుతున్న జీడీపీ కుడి కాలువ రెండు వైపుల గట్లు

గాజులదిన్నె కుడికాలువ కల్వర్టు పూర్తి గా దెబ్బతిన్నది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రాతి కట్టడం అంతా కూలిపోయింది. ఇక గట్టు కుంగేందుకు సిద్ధంగా ఉంది. నేడో రేపో ఈ ప్రమాదం అన్నవిధంగా ఉందని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువ గట్టు పైన ప్రతి రోజు వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, ఆటోలు, భారీ వాహనాలు కూడా వెళ్తుంటాయి. అయితే కాలువ గట్టు దెబ్బతినడంతో ఎప్పుడు ప్రమాదం ముంచుకువస్తుందో దిక్కుతోచని పరస్థితి ఏర్పడిందని ప్రయాణికులు వాపోతున్నారు. కుడి కాలువ దగ్గర రోడ్డు మలుపు ఉండటం, దీనికి తోడు ఇక్కడ రక్షణ గోడ సైతం లేక పోవడంతో మరింత ఇబ్బందిగా మారింది. కాలువ గట్లు రెండు వైపుల కుంగి పోయాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని వాహనాదారులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి పూట అయితే వాహనదారులు భయపడుతూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన కల్వర్టుతో పాటు రక్షణ గోడ కూడా నిర్మించాలని ప్రయాణికులు, చుట్టపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


సగంలో నిలిచి పోయిన ఎడమ కాలువ కల్వర్టు పనులు

మఠం మేనేజర్‌గా ఎస్‌కే శ్రీనివాసరావు


శ్రీనివాసరావుకు పీఠాధిపతి ఇచ్చిన మంత్రాక్షితలు అందజేస్తున్న ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్

మంత్రాలయం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మఠం మేనేజర్‌గా ఎస్‌కే శ్రీనివాసరావు ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు ఆదివారం పీఠాధిపతి ఫలపుష్ప మంత్రాక్షితలు, శేషవస్త్రం ఇచ్చి ఆయనను ఆశీర్వదించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

నందవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నందవరంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేశాయ్ మాధవరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందవరంలో తాగునీరు లేక గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. గ్రామానికి తాగునీరు అందించే తిమ్మారెడ్డి కుంట పూర్తిగా ఎండిపోయిందన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండి పడ్డారు. మే దాటిన తిమ్మారెడ్డి కుంటను నింపక పోవడం సిగ్గు చేటన్నారు.గతంలో మేము సర్పంచ్‌గా ఉన్నప్పుడు తాగునీటి సమస్య లేకుండా చేశామని గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆయన కోరారు.

పథకాలను తక్షణమే అమలు చేయాలి



మాట్లాడుతున్న నాగరాజు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, తక్షణమే సూపర్ సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని సీపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఐఎఫ్‌టీ కార్యాలయంలో జరిగిన డివిజన్ స్థాయి ముఖ్యనేతల సమావేశంలో నాగరాజు మాట్లాడతూ 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామిలను తక్షణమే నిలబెట్టుకోవాలని అన్నారు. సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా రాష్ట్ర పజలను మోసం చేశారని, నాడు బాబు ష్యూరిటి-భవిష్యత్తు గ్యారెంటీ అని మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో ఎం సత్యన్న, బాలరాజు, బాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చెట్నహాల్లిలో కొనసాగుతున్న బందోబస్తు

మంత్రాలయం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహాల్లి గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన వివాదంపై పోలీసుల బందోబస్తు ఆదివారం కూడా కొనసాగుతోంది. శనివారం దళితులపై జరిగిన దాడి కేసులో మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో బాదితులు ఫిర్యాదు చేశారు. అయితే ఈకేసును విచారణ కోసం ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబుకు బదిలీ చేసినట్లు తెలిపారు. ఆయన ఆదేశాల నిర్ణయంతో తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ రామాంజులు తెలిపారు. ఇరువర్గాల మధ్య శ్మశాన స్థల విషయంపై వివాదాలు ఉన్నాయని పరస్పర దాడులు, రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తే ఇరువర్గాలపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని, గొడవలు పడకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సీఐ రామాంజులు తెలిపారు. రాత్రి, పగలు బందోబస్తు కొనసాగుతోంది.

గుంతల రోడ్డుకు మరమ్మతులు


గుంతలు పడిన ప్రధాన రోడ్డుపై గరుసు వేస్తున్న దృశ్యం

కోసిగి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సాతనూరు గ్రామంలోని ప్రధాన రోడ్లపై వర్షం నీరు, మురుగునీరు నిల్వ చేరి రోడ్డుపై నడవలేని స్థితిలో ఉండగా.. సాతనూరు టీడీపీ నాయకులు బీటీ నాగేంద్ర, వాల్మీకి వెంకటేశ్, కురువ ముదుకప్ప, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాగవేంద్రరెడ్డికి తెలయజేయడంతో స్పందించిన ఆయన గ్రామంలోని గుంతల రోడ్లపై సొంత నిధులతో గరుసు వేయించారనీ స్థానిక టీడీపీ నాయకులు తెలిపారు. వర్షాకాలంలో రోడ్లు బురదమయంగా మారి నడవలేని స్థితిలో ఉండేదని, రాఘవేంద్రరెడ్డి స్పందించి సొంత నిధులతో ప్రధాన రోడ్లపై గరుసు వేయడం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు ప్రభు, రాజు, రంగస్వామి, మహదేవ, రామిరెడ్డి, పీర్‌బాబు, నవాజ్, నజీర్‌లు ఉన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నారాయణ డిమాండ్ చేశారు..రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 26వ రోజు సమ్మె చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ నుండి వైఎస్‌ఆర్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చెసుకుంటూ వెళ్లి అనంతరం మునిసిపల్ కార్యాలయం ఎదుట కూర్చొని తమ నిరసన తెలిపారు. అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ మాట్లాడుతూ నీటి సరఫరా, వీధి దీపాలు ఆపివేసి నిరవధిక సమ్మెలో వెళ్తుతున సిబ్బంది.సేవలను ఆపివేస్తున్న తరుణంలో తరువాత జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే భాధ్యత వహించాలని అన్నారు. కార్యక్రమంలో రాజేంద్ర, నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి కడుపు కొట్టిన ఘనత వైసీపీదే

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ● బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి: రాఘవేంద్రరెడ్డి


ఎమ్మిగనూరులో రేషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ


సుంకేశ్వరి గ్రామంలో పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న తదితరులు

ఎమ్మిగనూరు, జూన్1(ఆంధ్రజ్యోతి): పేదవాడి నోటి దగ్గర కూడును తీసేసిన ఘనత వైసీపీకే దక్కుతుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి దుయ్యబట్టారు. ఆదివారం పట్టణంలోని 33, 43 రేషన్ దుకాణాలను ఎమ్మెల్యే ప్రారంభించి కార్డుదారులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 1వ తేదినుంచి 15వ తేదివరకు మీకు వీలున్నప్పుడు వెళ్లి సరుకులు తెచ్చుకోవచ్చని తెలిపారు. డీలర్లు రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే తొలగిస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ శేషఫణి, ఇన్‌చార్జి సీఎస్‌డీటీ మహేష్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ కొండయ్య చౌదరి, కౌన్సిలర్లు వాహీద్, రామదాసు గౌడ్, సరోజమ్మ, నాయకులు నరసింహులు, మహేంద్ర బాబు, మల్లయ్య, దర్మాపురం గోపాల్, హనుమంతు, నవాజ్, బుగిడే నాగరాజు, జిలాన్, కేఎండీ ఫారుక్, రంగస్వామిగౌడ్, రామకృష్ణ నాయుడు, దేవేంద్ర, మహేష్, నాగన్న, మిన్నప్ప, జగదీష్ పాల్గొన్నారు.

● బనవాసి, కోటేకల్, మల్కాపురం, దైవందిన్నే కే తిమ్మాపురం, పార్లపల్లి, గుడికల్లు, కడిమెట్ల, కందనాతి,కడివెళ్ల, కలుగొట్లతో పాటు ఆయా గ్రామాల్లో రేషన్ దుకాణాల దగ్గర కార్డుదారులకు కూటమి నాయకులు, అధికారులు, రేషన్ డీలర్లు బియ్యం, చెక్కరను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: రేషన్ డీలర్లు సక్రమంగా ప్రజలకు రేషన్‌ను పంపిణీ చేసేందుకు కృషి చేయాలని టీడీపీ నాయకులు తిరుపతయ్యానాయుడు, మాజీ సాగు నీటిసంఘం అధ్యక్షుడు దరగలమాబు, మాజీ సర్పంచ్ రంగముని, అడ్వకేట్ చంద్రశేఖర్ అన్నారు. గోనెగండ్లలోని ఐదో రేషన్ షాప్ దగ్గర రేషన్ ను పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు చేపట్టారు.డీలర్ ఫకృద్దీన్, టయోటా ఉసేని, నాయక్ షాషావలి, మందకల్లు టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నందవరం: ప్రజా సంక్షేమమే టీడీపీ లక్ష్యం అని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు, మాజీ జెడ్పీటీసీ ఈరన్నగౌడు తెలిపారు. ఆదివారం మండలంలోని ముగతి, నాగలదిన్నె, జోహరాపురం, పెద్దకొత్తిలి గ్రామాల్లో ఆయన తహసీల్దారు శ్రీనివాసులుతో కలిసి రేషన్ దుకాణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో వీఆర్వో చక్రవర్తి, డీలర్ రాజశేఖర్ నాయకులు బార్గవ్‌యాదవ్, గజేంద్రరెడ్డి, జబ్బార్, వహబ్, మాజీ సర్పంచ్ బాలరాజు, అర్జున్, ఆనంద్ పాల్గొన్నారు.

మంత్రాలయం: రేషన్ సక్రమంగా అందించాలని, పేదలకు అందించాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న హెచ్చరించారు. ఆదివారం మంత్రాలయం మండలంలోని సుంకేశ్వరిలో తహసీల్దార్ ఎస్.రవి, వీఆర్వో ఆనంద్, సర్వేయర్ తిమ్మేష్ ఆధ్వర్యంలో నాయకులు రేషన్ దుకాణం ప్రారంభించి అనంతరం కార్డుదారులకు రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ ఆర్.లక్ష్మయ్య, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, చంద్ర, రోగెప్ప, లక్ష్మిరెడ్డి, విష్ణువర్ధన్, బీరప్ప, జనసేన నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: రాష్ట్ర ప్రభుత్వం జూన్ నుంచి ప్రజలకు రేషన్ సరుకులను డీలర్ షాపుల వద్దనే సరఫరా చేస్తున్నదని మండల ప్రజలు ఈ విషయాన్ని గుర్తించుకుని రేషన్ సరుకులను తమకు దగ్గరలోని షాపుల నుంచి తీసుకోవచ్చని తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప తెలిపారు. కౌతాళంలో ఆదివారం రేషన్ సరుకులను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు సిద్ధు మంజునాథ, కౌతాళం డీసీ కమిటీ అధ్యక్షుడు రఘరాం, నాగ, జిన్నా వలి పాల్గొన్నారు.

కబ్జా కానివ్వం: ఎమ్మెల్యే


వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని కర్నూలు రోడ్డుపక్కన ఉన్న బీసీ శ్మశానవాటిక స్థలాన్ని ఇంచుకూడా కబ్జాకాకుండా చర్యలు తీసుకుంటామని, ఎవరైనా కబ్జాలకు పాల్పడితే తోలుతీస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన బీసీ శ్మశానవాటికలో రోడ్డువేసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీసీ కులసంఘాల నాయకులు రంగస్వామి, బతకన్న, గణేష్, బీఎల్ నారాయణ, యాపిలయ్య, లక్ష్మన్న, అడ్వకేట్ నారాయణ , జగ్గాపురం ఈరన్న, శ్మశాన స్థలానికి సంబంధించిన మ్యాప్‌ను ఎమ్మెల్యేకు చూపించి వివరాలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్మశానవాటికలో ఎవరు ఎలాంటి కట్టడాలు కట్టకూడదని, రోడ్డు వేసేందుకు అనుమతి ఎలా ఇస్తారన్నారు. ఇది ఎవరు చేసినా తప్పేనన్నారు. శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఇది నామాటగా చెబుతున్నానన్నారు. కార్యక్రమంలో తహ సిల్దార్ శేషఫణి, కులసంఘాల నాయకులు వడ్డే బజారి, చంద్ర, లచ్చన్న, గిడ్డయ్య, దస్తగిరి,టీడీపీ నాయకులు కురువమల్లయ్య, రామకృష్ణ నాయుడు, ముద్దిలేటి, ఉరుకుందు, మహేష్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ తరగతులు

కౌతాళం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి జూన్ 21 వరకు యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయశేఖరరావు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 2 నుంచి 21 వరకు యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే జూన్ 2నుంచి 4వ తేది వరకు కౌతాళం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి యోగా పోటీలను నిర్వహిస్తామన్నారు. అలాగే 21 వరకు గ్రామ స్థాయిలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున మండల ప్రజలు ఈ యోగ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రహ్లాదరాయల వెండి రథోత్సవం



వెండి రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం జ్యేష్టమాస శుద్ధ షష్టి శుభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.బృందావనాన్ని బంగారు, వెండి, పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణబోధపూజ మందిరంలో ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. పీఠాధిపతి స్వహస్తాలచే మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడి గా మారింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహరాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది.

గోశాలకు రూ.2 లక్షలు విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన సుబ్బన్న ఆచార్ అనేభక్తుడు రూ. 2 లక్షలు గోశాలకు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జ్యోషి, శ్రీపతిఆచార్ తెలిపారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని చెక్‌ను విరాళం ఇచ్చినట్లు తెలిపారు.విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శ్రీరాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శ్రీపాదాచర్, సుజ్ఞానేంద్రాచార్ పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' పోస్టరు విడుదల


పోస్టరును విడుదల చేస్తున్న రుద్రగౌడ్

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన అబద్ధపు హామీలతో, చంద్రబాబు మోసాలు, ఆరాచ కాలకు జూన్ 4న వెన్నుపోటు దినం జరుపుకుంటున్న సందర్భంగా వైసీపీ రాష్ట్ర వీరశైవ లింగాయత్ అధ్యక్షుడు వై.రుద్రగౌడ్ పోస్టరును విడుదల చేశారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జూన్ 4వ తేదిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజు అని, అయితే అధికారంలోకి వచ్చిన ఇంత వరకు హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నజీర్, పట్టణ ఉపాధ్యక్షుడు నరసింహులు, కొమ్మురాజు, విరుపాక్షిరెడ్డి, బజారి, బీఎస్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నివారణకు స్పెషల్ డ్రైవ్

గోనెగండ్ల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో టీబీ(క్షయ)వ్యాధి నివారణకు ప్రభుత్వం టీబీ ముక్తభారత్ అబియాన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రతి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసుస్తన్నట్లు డివిజన్ టీబీ సూపర్ వైజర్ వేణుగోపాలచారి తెలిపారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం టీబీ వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి వైద్యసేవలు అందించేందుకు గాను ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమం 100 రోజుల పాటు ప్రతి గ్రామంలోని సచివాలయంలో జరుగుతుందన్నారు. ఆ సచివాలయ పరిధిలోని 60 ఏళ్లు పైబడిన వారి కి బీపీ, సుగర్, ఆయాసం, దగ్గు లక్షణాలు ఉన్న వారికి గళ్ల పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ అయితే ఆరోగికి ఆరు నెలలు ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. అలాగే పోషకాహారం కోసం ప్రభుత్వం నెలకు రూ. 1000 చెల్లిస్తుందన్నారు. టీబీ(క్షయ) వ్యాధి అంటువ్యాధి కావడంతో రోగుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సోమవారం హెచ్‌కైరవాడి, మంగళవారం కున్నూరు, బుధవారం ఐరన్‌బండ, శుక్రవారం పుట్టపాశం గ్రామాలతో పాటు పలు గ్రామాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతి

మంత్రాలయం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త లక్ష్మప్ప (40) గుండెపోటుతో మృతి చెందాడు. రోజూ కర్ణాటకలోని రాయచూరు వెళ్లి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవారు. ఆదివారం మధ్యాహ్నం రాయచూరులో గుండెపోటు రావడంతో అక్కడ పని చేస్తున్న సూపర్‌వైజర్ మహేంద్ర ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. లక్ష్మప్పకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కార్యకర్త మృతి చెందడంపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు అడ్వకేట్ విజయకుమార్, జనసేన నియోజకవర్గ నాయకులు యేసేపు, శివ, వీరేష్‌లు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి అన్ని విదాలుగా అండగా ఉంటామని, కుటుంబానికి భరోసా ఇచ్చారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ అన్నారు. చిన్నమరివీడు గ్రామంలో రాత్రి గ్రామంలో బస చేశారు. ప్రజలతో పోలీసు చట్టాలు, కోర్టు న్యాయం పట్ల అవగాహన కా ర్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం చేయండి


రాఘవేంద్రరెడ్డికి సమస్యను విన్నవించుకుంటున్న మహిళ

కోసిగి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌడుగల్లు గ్రామంలో ఆ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మా భూమిని కబ్జా చేశారనీ కోసిగికి చెందిన మందుల నరసమ్మ అనే మహిళ ఆదివారం మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డికి, ఎస్‌ఐ హనుమంతరెడ్డికి ఫిర్యాదు చేసింది. మందుల నరసమ్మ మాట్లాడుతూ గౌడుగల్లు గ్రామంలో సర్వే.నెం.68/1, 68/3లో ఆ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మాకు సంబంధించిన భూమిలో దౌర్జన్యంగా చొరబడి కబ్జా చేశారనీ, ఇప్పటికైనా అధికారులు, కూటమి నాయకులు స్పందించి తమ భూమిని విడిపించి న్యాయం చేయాలని బాధితురాలు విన్నవించగా, రాఘవేంద్రరెడ్డి సానుకూలంగా స్పందించి పూర్తి వివరాలు తెలుసుకుని ఆ మహిళకు న్యాయం చేస్తామని తెలిపారు.